నగ్నదిన మహోత్సవము

[లేడీస్ కల్చర్ క్లబ్]

చింతా దీక్షితులు

[ఈ కథలో సంస్థలూ పాత్రలూ కల్పితములు. దేనినీ ఎవరినీ ఉద్దేశించినవి కావు]

కచేరీపని చూచుకొని నేను సాయంత్రం యింటికివచ్చి అవశిష్టాలు తీర్చుకొని ఆరోజు న్యూసుపేపరు చదువుతూ సోఫామీద కూర్చున్నాను. ఆరోజున ఎందువల్లనో క్లబ్బునుంచి యింటికి వచ్చేసింది చప్పున నా భార్య చేతిసంచీ ఒకచేత్తోనూ, పొట్టి గొడుగు యింకోచేత్తోనూ పట్టుకొని స్లిప్పర్లు తొడుక్కొని. వచ్చేసరికి న్యూసుపేపరు బల్లమీద పెట్టి, "ఏమిటి సమాచారం, పటీ" అన్నాను, నాపక్క కూచోమని చోటుచేస్తూ.

"మరేమీలేదు. మీరు పాపం కనిపెట్టుకు ఉంటారని చప్పున వచ్చాను" అని నా భార్య, చేతిసంచీ బల్లమీదపెట్టి, గొడుగు సోఫామీద నా ప్రక్కనుపెట్టి, ఎదురుగా ఇంకో సోఫామీద, కూర్చుండి, "ఏమిటి పేపరు విశేషాలు?" అంది.

"మరేమీ లేవు. కాని నేను కనిపెట్టుకు ఉంటానని ఈ వేళమాత్రమే నీకు తోచిం దెందుకో?"

"ఈవేళేనా తోచిందని సంతోషించకూడదూ? ఎప్పుడూ తప్పులు వెదకడమే." అంది.

"నో ఫియర్, ఊరికే మాటవరసకి అడిగాను, డియర్."

"నాన్‌కింగ్ జపాను పట్టుకొన్నట్టేనా" అంది మాగృహకృత్యాలకి సంబంధించిన విషయంలాగే.

"ఆ, కొద్దిరోజులలో — రేపో, ఎల్లుండో జపానువాళ్ల వశమౌతుందన్నమాటే" అన్నాను.

"ఇంకా విశేషాలు?"

"తేనెటీగలకల్చరును గురించి మంచి వ్యాసం ఎవరో అనుభవజ్ఞుడు రాశాడు." అన్నాను.

"బీ కల్చరా! ఎవరిక్కావాలి పోనిస్తురూ."

"అయితే పటీ, బీకల్చరు అంటే"—

"తేనెటీగల్ని పుట్టించడం పెంచడం—"

"లేడీస్ కల్చరంటేనో?" అన్నాను.

"ఏమిటీ?"

"వినిపించ లేదూ?"

"మమ్మల్ని ఆక్షేపిస్తే ఊరుకోను సుమండీ, ఏమనుకున్నారో!"

"లేడీస్‌ను పుట్టించడం పెంచడం..."

"సంతోషించాం లెండి తెలివితేటలు. ఈపాటికి భోజనానికి, లెండి."

ఉడుకుబోతనంతో నా భార్య చేతిసంచీలోవస్తువులు యిటూ అటూ సర్ది, కలాలుతీసి బల్లమీద పెట్టి, హెయిర్ పిన్నులూ, దువ్వెనా, అద్దమూ సొరుగులో పెట్టి, కొన్ని కాగితాలు తీసుకొని వెళ్లి తన పెట్టెలో పెట్టి తాళం వేసుకొన్నది. ఇద్దరమూ భోజనానికి లేచాము.

*　　*　　*

భోజనము చేసి వచ్చి తాంబూలం నములుతూ సోఫామీద వాలుతుంటే పచ్చకాగితం మడత ఒకటి కింద కనిపించింది. నా భార్య సంచీలో కాగితాలు సర్దుకొంటూండగా కిందపడి ఉంటుందని ఊహించి బద్ధకంగా వంగి కాగితం మడతతీశాను. బద్ధకంగానే మడతవిప్పాను. మొదటి పంక్తి చదివాను. ఉలిక్కిపడి లేచి కూచున్నాను. ఎలెక్ట్రిక్ షాక్ తగిలినంతపని జరిగింది. ఆ మూలాగ్రంగా ఆ కాగితం చదివాను. "పటీ" అని కేక వేశాను.

"ఏమిటా వెర్రికేకలు— వస్తున్నానుండండి" అని ప్రక్కగదిలో నుంచి నా భార్య సమాధానం యిచ్చింది ప్రేమపూర్వకంగా! నా కళ్లను నేను నమ్మవచ్చునా, నేను కలగంటున్నానా అనుకొంటూ మళ్లీ కాగితం చదివాను. నాకళ్లు నన్ను మోసగించడం లేదు. పచ్చకాగితం మీద బంగారం అద్దిన అక్షరాలు, యింగ్లీషు అక్షరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నగ్నదిన మహోత్సవాహ్వాన పత్రిక —లేడీస్ కల్చర్ క్లబ్;—అని పైని హెడ్డింగు ఉన్నది:

*　　*　　*

నగ్నదిన మహోత్సవమును, యీయేడు కొత్తగా జరపవలెనని కార్యనిర్వాహకవర్గమువారు తీర్మానించారు కాబట్టి క్లబ్బుసభ్యురాండ్రందరూ యిందు పాల్గొనవలసినదనీ, జయప్రదముగా నిర్వహించడము

నవసన్నా యిందుమూలముగా ఆహ్వానింపబడుచున్నారు.

షరాలు-

౧. అందరికీ అనుకూలమైనదినమే ఏర్పాటుచేసి తెలియజేయబడును కాబట్టిన్నీ అందరికీ అనుకూలమైన రహస్యస్థలమందే యీ మహోత్సవము జరుపుటకు నిశ్చయింపబడినది కాబట్టిన్నీ సభ్యురాండ్రందరూ తప్పక పాల్గొనవలసి యున్నది. పాల్గొనని సభ్యురాండ్రు తమ సభ్యత్వమును వదలుకోనైనా వదులుకోవాలి, లేదా, ఏభై రూపాయలు క్లబ్బుకు దండుగైనా చెల్లించాలి.

౨. సభ్యురాలు ఒక్కొంటికి నమ్మకమైన ఒక స్నేహితురాలిని గెస్టుగా తీసుకొనిరావచ్చును. పూర్వకాలపు వితంతువులైనా సరే. సభ్యురాండ్రవలెనే స్నేహితురాండ్రున్నూ, క్లబ్బురూల్సు అన్నింటికీ బద్ధులై ఉండవలెను.

౩. నగ్నదినమున పాల్గొనే సభ్యురాండ్రు గాని, యితరస్త్రీలు గాని ఎట్టివిధమైన బట్టలూ—నూలువికాని, పట్టువికాని, ఉన్నివికాని, మరి ఏ యితరపదార్థములతో తయారైనవికాని—కట్టుకోరాదు. ఏ శరీరభాగమూ ఆచ్ఛాదితము కారాదు.

౪. తీసివేయడానికి వీలైన నగలు తీసివేయాలి. తీసివేయడానికి వీలులేని నగలు—కడియాలూ-చెవులకు పోసులతో బంధించిన లోలకులూ, జూకాలూవంటి ఆభరణాలూ మున్నగు ఉంచుకోవచ్చును. ఎవరికైనా నల్లపూసల పేర్లూ మంగళసూత్రాలూ ఉన్నట్లయితే అవి కూడా తీసివేయడం మంచిదని సలహాయిస్తాము సిల్లీ సెంటిమెంటూ, తెలివి తక్కువ సందేహాలూ పెట్టుకోవడం మంచిది కాదుగదా!

౫. శరీరమున కంతకూగాని, ఏఒక్క శరీర భాగమునకు గాని ఎట్టిపూతలూ పనికిరావు. ఫేసుపౌడరు, స్నో, ఛెర్రీబ్లాసం, లిప్‌స్టిక్, గంధం, పసుపు, కుంకుం, తలనూనె యిత్యాది పూతలేమీ పూసుకోరాదు. అందరూ తలనీళ్లోసుకొని ఆరోజున వచ్చి ఆవుత్సవములో పాల్గొనవలెను.

౬. జడలూ, ముడులూ వేసుకోరాదు. కొప్పు పెట్టుకోరాదు. తలలో పువ్వులూ, పిన్నులూ పెట్టుకోరాదు.

౭. పాలుతాగే చంటిపిల్లలున్నవాళ్లు పిల్లలను తీసుకొని రావచ్చును గాని యింటి వద్ద దాదులకు వప్పజెప్పడమే మంచిదని అట్టివారికి సలహా యిస్తున్నాము.

౮. ఆరోగ్య సౌందర్యముల వృద్ధికొరకే ఈ నగ్నదిన మేర్పాటైనది. కాబట్టి అందు కనుగుణంగా అందరూ సంచరిస్తారని ఆశిస్తున్నాము.

౯. ఈవిషయం సభ్యురాండ్రున్నూ, గాదలిచినవారి స్నేహితురాండ్రున్నూ గూఢాతిగూఢంగా ఉంచాలి. భర్తలకుసమేతం చెప్పరాదు.

౧౦. మహోత్సవము జరుగుదినమున్నూ, స్థలమున్నూ ముందుముందు తెలుపగలము.

* * *

ఇదీ సంగతి నేను కలకనడం లేదు. ఇదంతా యదార్థమే. మళ్లీ కేక వేశాను "వటీ" అని.

వచ్చింది నా భార్య-వటీ! జపాను స్త్రీలు వేసుకొనే "కిమోనో" అనే చొక్కా తొడుక్కొంది. వళ్లంతా పట్టుపువ్వులు, పట్టు ఆకులు, పట్టు సీతాకోకచిలకలతో మెరిసిపోతోంది. చీర కట్టుకోలేదు. చీరకు బదులు టర్కీ స్త్రీలు తొడుక్కొనే లాంటి లాగు తొడుక్కొంది. మొహమల్ స్లిప్పర్లు తొడుక్కొంది. తాంబూలం నములుతూ వచ్చింది. నా భార్యను నేను పోల్చలేనంతమార్పు ఆ అలంకరణ మావిడకు తెచ్చిపెట్టినది. వచ్చి సోఫామీద నాపక్కని కూచుంది. "వెల్, మైడియర్, ఎందుకు పిలిచారు?" అంది.

ఎంతో ఉత్సాహంతో నాకు ఆనందం కూర్చాలని కొత్తకొత్త అలంకారాలు చేసికొనివచ్చి నా పక్కని కూచున్న నా భార్యకు ఉత్సాహభంగం కలగజెయ్యడం క్రూరత్వమనిపించింది. నగ్నదినం సంగతి తరవాత మాట్లాడుకో కూడదా అనుకొన్నాను. లోపలనుంచి పుట్టుకువస్తూన్న కోపాన్ని, జెలసీని దిగమింగదలిచాను. కాగితం మడత నా భార్యకు కనిపించకుండా సోఫా కవరులోకి తోశాను.

"ఎందుకు పిలిచారో మాట్లాడరేం?" అంది నా బుజంమీదికి వాలుతూ.

"ఊరికేనే, ఆలస్యంచేస్తూ ఎంతకూ రాలేదని" అని అబద్ధమాడాను.

"మరి ఆ వెర్రి కేక వేశారేమి?" అన్నది నామీసం వదులుగా పట్టుకొని.

"వెర్రికేకా; నేను కేకవేస్తే వెర్రికేకాను, నువ్వు కేకవేస్తే కోకిల పలుకూను—అవునా?"

"మీరు తొందరగా బెంగగా కేక వెయ్యలేదూ? నిజం చెప్పండి."

"నేను చూస్తే వెర్రి చూపూను, నువ్వుచూస్తే తుమ్మెదబారూను—అవునా?"

"కావ్య" ధోరణిలో పడుతున్నారేం? మను చరిత్రగానీ చదువుతున్నారా ఏమిటి?" అంది మీసం నులుముతూ

"నువ్వు పిలిస్తే ఆజ్ఞాను, నేను పిలిస్తే మాటాను—అవునా?" అన్నాను మీసం వదిలించుకొని.

"నా పీచ్‌కి ధోరణి ఎక్కువౌతోందేం?" అంది నా క్రాపింగుజుట్టులో వేళ్లుపెట్టి తడుముతూ.

"మై డార్లింగ్" అని నడుంచుట్టూ చెయ్యివేసి దగ్గిరికి లాక్కొన్నాను.

నా భార్య తల షాంపూ వాసన వేస్తోంది. ముఖం పౌడరు వాసన. చెక్కిళ్లు చెర్రీవాసన. కిమోనో మల్లి పువ్వుల వాసన. నా గదిలో అత్తరవు చెట్లు పూసినట్లుంది. నాభార్య వళ్లో వాలింది.

మళ్లీ నగ్నదినం సంగతి జ్ఞాపకం వచ్చింది. అడగా లనుకొన్నాను. ఆనందమయమైన నాగదిని శుద్ధ సినీమాసీను చెయ్యడం మంచిదికా దనిపించింది. అయినా—మొత్తం మీద—ఆడవాళ్ల తళుకు బెళుకుల ముందర మగవాళ్లు వత్తి......

౨

ఉదయాన్నే కాల్యకృత్యాలు తీర్చుకొన్నాను. నాభార్య కాఫీ వగైరాలు బల్లమీద తయారుచేసి ఉంచింది. ఇద్దరమూ కబుర్లు చెప్పుకొంటూ కాఫీ పుచ్చుకొంటున్నాము. నా భార్య ఒక స్వెటరు వేసుకొంది. పల్చని చారలచీర కట్టుకుంది. అది బహుశా ఉదయకాలపు డ్రస్సై ఉండవచ్చు.

"అయితే వటీ—ఈమధ్య నేనో పుస్తకం చదివాను. బహుశా నువ్వూ చదివే ఉండవచ్చు. "న్యూడిస్టుకల్టు" దానిపేరు అన్నాను.

"ఒకపుస్తకమేమి? చాలా పుస్తకాలు చదివాను" అన్నది కాఫీ చప్పరిస్తూ.

"అయితే ఈ నగ్నసిద్ధాంతం నీకు సమ్మతమే నంటావా? ఆడవాళ్లూ, మగవాళ్లూ దిగంబరులై ఏక దేశంలో సంచరించడం ప్రమాదకరంగాదూ?"

"మీ కన్నీ ప్రమాదకరాలే! నాలుగు శతాబ్దుల వెనక ఉండవలసినవారు మీరు."

"నువ్వు నాలుగు శతాబ్దాలు ముందుండవలసినదానవు కావూ?"

"మాటలు నేర్చినకుక్కను ఛీ అంటే ఛీ అందిట."

"సరేగాని, మనము ఒక సంఘంలో ఉన్నతరవాత ఆ సంఘపు కట్టుబాటుల......"

"చాల్లెండి మీరూ మీపుచ్చు సంఘమూను. వితంతు వివాహమంటే, విడాకుల చట్టమంటే, రజస్వలా వివాహమంటే, నగ్నసిద్ధాంతం అంటే అన్నీ ప్రమాదకరములే మీకూ మీ సంఘానికిన్నీ."

"అయితే ఒక ప్రశ్న అడగనా?"

"అడగండి. అందుకు నా ఆజ్ఞ కావాలా?"

"మరి నీవు వెడతావా నగ్నదిన మహోత్సవానికి?"

నా భార్యముఖం వెల్లబారింది. ఎరగనట్టు నటిస్తూ అందికదా "నగ్నదిన మహోత్సవ మేమిటి?"

"ఏమిటో నీకు తెలియదూ?"

"ఏమిటో అసలు చెపుదురూ?"

"నీకు తెలియదూ?"

"చెప్పరుకాదూ! నా స్వీట్ డియర్ కాదూ! నా సోల్ కాదూ! చెప్పండి మరి!"

"నీకు ఆహ్వానం కూడా వచ్చింది కాదూ?" అన్నాను.

"ఎవరు చెప్పారు మీకు ?"

"ఎవరూ చెప్పలేదు. నేనెరుగుదును."

"అలాగా! ఎరిగుంటే దాచుకోండి! నాకు చెప్పక్కర్లేదులెండి."

"మీ క్లబ్బువారే జరుపుతారటగా" అన్నాను.

నాభార్య భయంతో అనుమానంతో తాగుతూ తాగుతూ ఉన్న కాఫీ అక్కడ ఉంచి లోపలికి వెళ్లింది. తనపెట్టె తాళంతీసి కాగితాలన్నీ పరీక్షచేసింది. నాగదంతా వెదికింది. నాకాగితా లన్నీ కిందామీదా పారేశింది. తనచేతి సంచీ తిరగా బోర్లా వేసి చూచింది. బిక్కమొహంతో వచ్చి మళ్లీ నాయెదట కూర్చుని కత్తులు విసురుతోంది నామీద కళ్లతో!

"ఇలాంటిపనులు ఎప్పుడు నేర్చుకొన్నా" రంది.

"ఎలాంటిపనులు?"

"దొంగపనులు - నాకాగితం మీరు తియ్యలేదూ!"

"కాగితం పారేసుకున్నావా?"

"మరే."

"మరే అయితే అనుభవించు."

"నాకాగితం తీశారాలేదా!"

"నిజం చెప్పనా?"

"నాకాగితం నా కియ్యండి."

అని ఏడుపుమొహం పెట్టింది.

"నేను నీకాగితం తియ్యలేదు, కళా! నిన్నరాత్రి సోఫాకిందఉంటే ఏమిటోనని తీసి చూచాను" అన్నాను లేచి నాభార్యవెనక నిలబడి తలరాస్తూ.

"సంచీలోంచి పడిపోయింది కాబోలు-" అన్నది.

"కావచ్చు" అన్నాను.

"నాకాగితం మీ రెందుకు చదరవాలి?"

"చదవవద్దన్నావా?"

"నా కేంతెలుసు మీరు తీస్తారనీ?"

"దానిమీద చదవవద్దని లేదే!"

"నా కాగితం నాకివ్వండి."

"సోఫామడతలో పెట్టాను."

అనడంతోనే నాభార్య గదిలోకివెళ్ళి ఆహ్వానపత్రిక తెచ్చింది.

"భర్తలకు కూడా చెప్పగూడదని యిందులో లేదూ" అన్నది.

"ఉన్నమాట వాస్తవమే."

"మరి ఎందుకు చదివారూ?"

"నీకు మతిపోతోంది. చదివాక తెలిసింది ఆవాక్యం అందులో ఉన్నదని. నేను చదివితే నీకు వచ్చే ఉపద్రవం ఏమీలేదూలే."

"నే నొకటి చెపితే చేస్తారా?."

"ఒకటిగాదు, పది చేస్తాను."

"ఇందులో విషయాలు ఎవరితోనూ చెప్పనని ఒట్టు వేసుకోండి."

"ఏమని ఒట్టు?"

"నామీద ఒట్టు వేసుకోండి."

"అమ్మో! నీమీదే? నేను వేసుకోను. నీవు నా ప్రాణమునకును ప్రాణమూ ప్రాణకాంతవు కాదూ?"

"అయితే యితరులతో చెప్పతారన్నమాట" అంది.

"ఎన్నటికీ చెప్పను" అన్నాను.

"అయితే ఒట్టేసుకోండి" అని చేతులెత్తి నా చెవులు గట్టిగా పట్టుకొని, "వేసుకుంటారా? వేసుకుంటారా? ఏం?" అంది.

"వదులు, వదులు, అమ్మో, అయ్యో, వదులు, వేసుకుంటా వేసుకుంటా" అన్నాను ఆమె తలమీదకు వంగి.

"వేసుకోండి మరి."

"వదులు, వేసుకుంటా! ఎవ్వరితోనూ నగ్నదిన మహోత్సవాహ్వాన పత్రికను గురించి చెప్పను—నీతోడే; నీ మీద ఒట్టు—ఈ మాటు వదులు."

నాభార్య చెవులు వదిలింది. నిలబడి రెండు చెవులూ ఎన్నిమార్లో ముద్దెట్టుకొంది. ఆ విధంగా నొప్పి తీసివేసిందట.

"వట్టిమోటమనిషివై పోతున్నావు సుమా! అబ్బ" అన్నాను చెవులు తడుముకొంటూ.

"మరే! నాకాగితం చదవొచ్చుగాని" అంది.

"నీవే యింత పెంకెమనిషివి గాని మిగిలిన స్త్రీ మెంబర్లందరూ తమ భర్తలతో చెప్పకుండా ఉండగలరనుకున్నావా ఏమిటి?"

"ఎప్పుడూ చెప్పరు."

"చెప్పరూ? అందరూ నీలాగే అనుకొన్నావు కాబోలు?."

"మగవాళ్లనుకొన్నారా ఏమిటి చెప్పడానికి?" అని నాకేసి తిరిగి పెంకె నవ్వు నవ్వింది.

"అవును, అందుకనే ఆడవాళ్లనోట్లో నువ్వుగింజ నానదన్నారు" అన్నాను.

"మానోట్లో నువ్వుగింజ నానక్కర్లేదులెండి. అన్ని నువ్వుగింజలూ మీ నోళ్లల్లోనే నానవేసుకోండి" అని విసురుకుంటూ తిప్పుకుంటూ స్లిప్పర్లు తొడుక్కొని కాఫీముగించి నాభార్య యింట్లోకి వెళ్లిపోయింది - డ్రెస్సు మార్చుకోవడానికి.

నే నెన్నో ప్రశ్నలు వేయదలుచుకొన్నాను ఆవిడ్ని. వీలైనదికాదు. పోనీ యింకోమాట.

3

నెల్లాళ్లక్రితం ఒకఇంగ్లీషు దొరసాని లేడీస్ కల్చరల్ క్లబ్బులో "దిగంబరత్వము: ఆరోగ్యము" అనేవిషయముమీద ఉపన్యాసము యిచ్చినదట. దిగంబరత్వమనగానే భయపడనక్కరలేదనీ, దానివల్ల ఎటువంటి ముప్పులూ సంభవించవనీ, వస్త్రధారణము మనము తెచ్చిపెట్టుకొన్నది గాని మనకు సహజముకాదనీ, దిగంబరత్వమే మనకు సహజమైనదనీ, మృగములనుండి మనము నేర్చుకొనవలసిన విషయములలో యిది వక్కటనీ ఉపన్యసించింది. ఈ వస్త్రధారణమువల్ల మనకు అనేకకీడులు తటస్థిస్తున్నవనీ, అనేక చెడుగుణములు కలుగుతున్నవనీ నొక్కిచెప్పింది.

సిగ్గు బిడియములు జంతుకోటిలో ఎక్కడా లేవనీ వస్త్రధారణమువల్లనే మనుష్యుల కవి సంక్రమించినవనీ తెలియజేసింది. సూర్యరశ్మి తగలకుండా, గాలి ప్రవేశించకుండా దేహభాగములు నిరంతరమూ కప్పుకోవడంవల్ల స్త్రీ పురుషుల కనేకవిధముల రోగములు కల్గుతున్నవని నిదర్శనపూర్వకముగా నిరూపించింది. ప్రపంచములో కామవికారము జంతువులం దుద్భవించడము సంతానాభివృద్ధికోసమే ననీన్నీ, అది ఒక ఋతువులోనే తటస్థిస్తున్న దనీన్నీ, మానవులలో యీ కామము, వస్త్రధారణమువల్లనే అసహజమై, రోగప్రాయమై, నిరంతరమై, బాధించుచున్నదనీన్నీ, దిగంబరత్వమే అవలంబించినట్టయితే నీతి దుర్నీతులకు సంఘములో స్థానమే ఉండదనీన్నీ తేల్చింది. స్త్రీ పురుష భేదము మానవ హృదయాలలో అంకురించడా

నికి యీ వస్త్రధారణమే మూలమన్నది. దిగంబరత్వమువల్ల అట్టి భేదము అంతరించుననీ మానవులలో ఏకత్వం సంభవించుననీ చెప్పింది. ఆవులూ, కుక్కలూ, పిల్లులూ మున్నగు జంతువులు నగ్నంగా లేవా? అందువల్ల వాటికేమిముప్పువచ్చింది? వాటిని మనము నగ్నముగా చూడ్డంలేదా? మనకు వింతగా ఉన్నదా? కారణము అలవాటు. కాబట్టి అలవాటుచేసుకొన్నట్టయితే దిగంబరత్వమువల్ల మనకు అనేకలాభములు కలుగుననిచెప్పింది. దిగంబరత్వము మనసిగ్గును పారదోలుతుంది. మనసీతిని తలయెత్తనియ్యదు. మనని౦తరకామ వికారమున కది మందు. మనరోగము లంతరించుటకు దిగంబరత్వ మమృతప్రాయమైనది. దిగంబరత్వము మన జన్మహక్కు అని ఆదొరసాని తన ఉపన్యాసము ముగించింది.

ఈ ఉపన్యాసము విన్న లేడీస్ కల్చరుక్లబ్బు మెంబర్లందరూ ఎంతో సంతోషించారు. నాగరీకమున కాటపట్టులైన పాశ్చాత్యదేశాలల్లో నగ్నశ్రేణులు బయలుదేరు తున్నవన్న కారణముచేత తామున్నూ అట్టి ప్రయత్నములు సల్పడము ఉచితమని తీర్మానించుకొన్నారు. దేశకాలముల ననుసరించి ప్రస్తుతము స్త్రీలు మాత్రమే నగ్నత్వం అవలంబించవలెననిన్నీ, అవసరమని తోస్తే ముందుముందు పురుషులను కూడా చేర్చుకోవచ్చుననిన్నీ అనుకొన్నారు. దీని పర్యవసానమే నగ్నదినమహోత్సవాహ్వాన పత్రిక.

* * *

"సిగ్గూబిడియం లేకపోతే సరి-ఎందుకొచ్చిన బతుకంట - మనిషిజన్మ ఎత్తితే సరా..." అనబోతూంటే నా భార్య నా నోటి కడ్డంగా చెయ్యిపెట్టి అన్నదికదా, "మైడియర్ స్వీట్ హబ్బీ, మీ కేమైనా ఇమేజినేషన్ ఉందా? ఊహాపోహలున్నవా? స్వతంత్రాలోచన ఉందా? దిగంబరత్వాన్ని గురించి యింతా చెప్పితే శ్రీరంగనీతులు చెబుతున్నారా? మీరు నాకు భర్త అని చెప్పకోడానికి నాకు సిగ్గుగా ఉంది."

"అయితే వదిలిపెట్టరాదూ."

"మిమ్మల్నా వదిలిపెట్టడం? వటీరావు అంటే ఏమనుకొన్నారో?"

"అయితే నిజం చెప్పు; బట్టలు లేకుండా తిరిగితే సిగ్గుండదూ?"

"ఎందుకు సిగ్గు; మీరు నా ముక్కు చూడ్డంలేదూ, నోరు చూడ్డంలేదూ, చెవులు చూడ్డంలేదూ? సిగ్గుపడుతున్నారా? దేహమంతా చూపితే ఏమితప్పు ఎందుకంట సిగ్గు."

"అను, అనేదేమిటో పూర్తిగాఅను."

"అంటాను నాకేం భయం లేదు. ఈ దొంగ బిడియాలు నాచేత గావు. బ్రాహ్మలనీ బ్రాహ్మణేతరులనీ, స్త్రీలనీ పురుషులనీ, భేదాలు పెట్టి అన్యాయం చేసేరోజులు వెళ్లాయిలెండి."

"అయితే యీస్త్రీ పురుష భేదానికి కూడా బ్రాహ్మలే కారణమంటావా ఏమిటి?"

"ఏమో! ఎవరుకారణమైతే నేమి? అన్యాయం అన్యాయమే."

"శాంతించు, వటీ, శాంతించు— ఆవేళ నేను చెప్పినమాట నిజమైందా?"

"ఏమిటా మాట?"

"మెంబర్లు భర్తలతో యీవిషయం చెబతారన్నాను, జ్ఞాపకంలేదూ."

"నే నెవ్వరినీ అడగలేదులెండి."

"నేను అడక్కుండానే మెంబర్ల భర్తలు నాదగ్గిరికి వచ్చి ముక్కుమీద వేలు వేసికొని చెప్పారు" అన్నాను.

"చెప్పి!"

"ఇది తప్పించే మార్గం లేదా అన్నారు."

"అంటే మీ రేం చెప్పారు?."

"ఏమీ లేదు. చూస్తూ ఊరుకొని ఉండడమే మంచిది అని చెప్పాను."

"ఇన్నాళ్లకు మీరు తెలివిగా ప్రవర్తించారని సంతోషిస్తున్నాను."

"అయితే, కళా, మొగాళ్లులేని ఆడవాళ్లనగ్నత్వంవల్ల ప్రయోజనమేమిట"న్నాను.

"అయితే మీరుకూడా వస్తారా?"

"నన్ను రానిస్తారా?"

"మీకొక్కరికీ నేను అనుమతి తెస్తాననుకోండి."

"నేను రానుసుమా, నాకు సిగ్గు."

"అయితే ఎందు కాపెంకె ప్రశ్న వేశారు?"

"నీచిత్తవృత్తి తెలియడానికి."

"అయితే మీ రొచ్చి తీరాలి. తప్పదు."

"బలవంతమా ఏమిటి."

"ఆ, బలవంతమే. రహస్యంసుమండీ, ఎవరితోనూ చెప్పకూడదు సుమండీ-"

"మళ్లీ నీమీద ఒట్టేసుకొమ్మంటావా?"

"నామీద ఒట్టేసుకొమ్మనను లెండి—వినండి. ఆదవారం రాత్రి పది గంటల మూడుగంటల మధ్య దీపస్తంభాని కెదురుగా ఉన్న బీచిలో నగ్నదిన మహోత్సవం జరుగుతుంది."

"రాత్రి చీకటికాదూ."

"వెన్నెల రాత్రుల్లు కాదండీ."

"అవును అన్నట్టు; రాత్రి బీచి ఒడ్డున చలివెయ్యదూ?"

"ఓర్చుకోవడానికి సిద్ధపడ్డాము లెండి. ఎవరితోనూ చెప్పకండిసుమా. మీరొక్కరే రండి."

"చూస్తాను."

"చూడ్డంకాదు. తప్పక రావాలి!"

* * *

క్లబ్బు మెంబర్లందరూ మహోత్సవం జరపడానికి మార్గాలాలోచించుకుంటూంటే మెంబర్లభర్తలము మేమందరమూ దానిని చెడగొట్టే ఉపాయాలు వెదుకుతున్నాము.

ఒకరోజు ముందునుంచీ క్లబ్బు మెంబర్లందరూ క్లబ్బులోనే ఉండిపోవడం మొదలుపెట్టారు. అక్కడే భోజనాలేర్పాటు చేసుకొన్నారు. అక్కడే పడకలు ఏర్పాటు చేసుకొన్నారు.

ఆకారణంవల్ల భర్త లందరికీ కొంత తీరుబడి చిక్కింది. మేమంతా మాయింట్లో సమావేశమయ్యాము. మన హిందూదేశంలో మన స్త్రీలు యిటువంటి పనులు చేస్తున్నారంటే లోకములో హిందూ స్త్రీజాతి కంతకీ అవమానకరంగా ఉంటుం దనిన్నీ, హిందూ స్త్రీల మాన మర్యాదలు కాపాడేబాధ్యత పురుషుల మీద ఉన్నదనిన్నీ, తత్కారణ మున ఈనగ్నదిన మహోత్సవం జరగకుండాచెయ్యడం ధర్మమనిన్నీ తీర్మానించుకొన్నాము. ఈఉత్సవము జరిగేస్థలము కాలము తెలుసుకోవలసిన అవసరం ఉన్నదనుకొన్నాము. స్థలమూ కాలమూ నాకు తెలుసునన్నాను. నాతోబాటుఅక్కడిపురుషులందరూ మాకు తెలుసునంటే మాకుతెలుసునన్నారు. అందరికీ తెలిసినస్థలము — దీపస్తంభాని కెదురుగా బీచివద్దు. అందరికీతెలిసిన కాలము — ఆదివారంరాత్రి పదిగంటలకీ మూడుగంటలికీ మధ్యకాలం. ఇక దీనికి ఆటంకములు కలుగజెయ్యడము ఎలాగా అనుకొన్నాము. 'ఆడవాళ్లను ఆరోజున యింట్లో బంధించకూడదా?' అన్నాడు ఒకపెద్ద మనిషి --స్త్రీస్వభావం తెలియనివాడు, ప్రాణాలకు తెగించీ!

'ఆడవాళ్లకు నగల బట్టల ఆసచూపి మానిపించవచ్చునేమో?' అన్నాడు ఇంకోడు ధనికుడు.

'వాళ్లతోపాటు మనమున్నా అక్కడ అప్పుడు తయారవుతేనో?' అన్నాడు యింకో బుద్ధిమంతుడు. ఈ ఉపాయం బాగుందంటే బాగుం దని అందరమూ వప్పుకొన్నాము. అందరమూ, ఆరోజున, గూఢమార్గాన్ని బట్టి ఎవరికీ తెలియకుండా బీచికి చేరుకోడానికి నిశ్చయించుకొన్నాము.

అయితే ఒకసందేహం కలిగింది. ఒకవేళ స్థలమూ కాలమూ విషయమై ఏమైనా మోసం జరిగిందేమో? ప్రతీభర్తా యీవిషయం తనభార్య చెప్పగా తెలుసుకొన్నట్టే చెప్పాడు. భార్యలందరూ భర్తల్ని ఒకమోస్తరుగానే మోసంచేసి ఉంటా రనిపించింది. ఏమైనా స్థలమూకాలమూ అవే అని నిశ్చయము చేసుకొన్నాము.

౪

ఆదివారం తొమ్మిది గంటలకు భర్తలందరమూ మాయింట సమావేశమయ్యాము. మోస ముండదని నిశ్చయించడముకోసము క్లబ్బువ్యవహారాలు తెలుసుకొంటున్నాము.

క్లబ్బుకు ఉండుండీ ఒక్కొక్క కారు వస్తోందిట. రావడంతోనే ముసుగేసుకొన్న ఒకస్త్రీ కారులో ఎక్కుతోందిట. తెరలు దింపుకొని కారు బీచికి వెళ్లుతోందిట. ఇది తెలుసుకొన్నపిమ్మట మాకు ధైర్యం కలిగి ఒకరితరువాత ఒకరము వేరువేరు మార్గాల్నిబట్టి బీచికి బయలుదేరాము.

పది దాటింది. మేమందరమూ అనుకొన్న ప్రకారము దీపస్తంభము వెనక చేరుకొన్నాము. కార్లు వస్తున్నాయి. స్త్రీలు దిగుతున్నారు. స్త్రీలు ముసుగుతోనే బీచివద్దునతిరుగుతున్నారు. రావలసినకార్లన్నీవచ్చినట్టే తోచింది. అందరుస్త్రీలూ దిగినట్టే తోచింది. గుంపులు గుంపులుగా స్త్రీలందరూ చేరుకొని ఏవేవో కబుర్లు చెప్పకొంటున్నారు.

స్త్రీలు తమబట్టలు విసర్జించుకోవడం మొదలు పెట్టడంతోనే మేము మరుగునుంచి వెల్లడిస్థలమునకు, వారికి బాగా కనిపించే స్థలమునకు రావలెనని నిర్ధారణచేసుకొన్నాము. పదకొండుగంట లైంది. స్త్రీలు

యథాప్రకారం తిరుగు తున్నారు. నగ్నలు కాలేదు. పన్నెండు గంటలైనది. ఏమీ మార్పు లేదు.

మాకు కారణం తెలిసింది కాదు. మమ్మల్ని కనిపెట్టి ఉంటారా వాళ్లు అనుకొన్నాము. మేము కోరినదీ అదేగదా! వాళ్ల నగ్నదినమును భగ్నము చెయ్యడమే మా ఆశయముగదా! అది ఈడేరుతూన్నందుకు మాకు సంతోషముగానే ఉన్నది కాని—నిజం చెప్పవలసి వస్తే—మా కందరికీ ఒక విధంగా ఆశాభంగం కలిగింది. ఎంత నగ్నదినాన్ని భగ్నం చెయ్యదలచుకొన్నా మా మనస్సులు నగ్నలను చూడ్డానికి తహతహపడుతూనే ఉన్నవి.

ఒంటిగంట అయింది ఏమీ మార్పు కానరాలేదు. మాకు విసుగెత్తింది. చలి వేస్తోంది. నిద్రకు కళ్లు బరువెక్కుతున్నాయి. చంద్రుడు పశ్చిమదిక్కు చేరబోతున్నాడు. చంద్రకాంతిని తరంగశిఖరాలమీద లాలిస్తున్నాడు సముద్రుడు. సముద్రఘోష దిక్కులను కప్పింది.

మేము ఒకరొకరముబీచికి చేరుకుంటున్నాము. నీరుపారి తడిసి గట్టిపడిన యిసుకమీద నడిచి వెళ్లాము. స్త్రీల గుంపు''నుస మీపించాము. నాభార్య కోసం నేను వెదికినట్లే యితరులున్నూ తమభార్యలకోసం వెదుకుకొన్నారు. నాభార్య నాకు కనిపించలేదు. వాళ్ల భార్యలు వాళ్లకు కనిపించ లేదు.

రెండుగంట లయింది. అందరమూ మళ్లీ దీపస్తంభందగ్గిర చేరుకొన్నాము. ఏమిటిది అంటే ఏమిటిది అనుకొన్నాము.

మనలను మోసంచేసి వాళ్లెక్కడికో పోయారు అని సిద్ధాంతం చేసుకొన్నాము.

మరి యీబీచిని యీస్త్రీరత్నము లెవరు?

పరిశీలనగా చూచిన ఇద్దరుముగ్గురు పెద్దమనుష్యులు—

"వాళ్లు దాసీవాళ్లు చూడలేదా?" అన్నారు.

మూడుగంటలైంది. బీచిలో స్త్రీగుంపులు కరిగిపోతున్నాయి. చంద్రుడు అస్తమించాడు.

మేము ఇంటిమొహం పట్టాము, తలలమీద గుడ్డలు బిగించుకొని! కారులు మమ్మల్ని హూటుచేస్తూ పారిపోతున్నాయి దాసీవాళ్లతో కూడా.

సముద్రుడుకూడా తన ఘోషతో మమ్ము గేలిచేస్తున్నాడు.

౫

సోమవారం ఉదయం యింటికి చేరుకొన్నాను. భర్తలందరమూ కాలవ ఒడ్డున మొహాలు కడుక్కొని ఏవిధంగా అలవిగాని ఈభార్యలను వశము చేసుకోవడమో ఆలోచించి యిళ్లకు చేరుకొన్నాము.

నా భార్య కాఫీ, టిఫిన్ సిద్ధంచేసి ముసిముసి నవ్వులతో, నేను గుమ్మం దాటడంతోనే "గుడ్ మార్నింగ్, డియర్" అన్నది. నా కాశ్చర్యం వేసింది. నా భార్య యింట్లోనే ఉన్నదే. నగ్నదిన మహోత్సవం జరగలేదు కాబోలు అనుకున్నాను. "గుడ్‌మార్నింగ్, డార్లింగ్" అని ముభావంగా చెప్పి లోపలికి వెళ్లిపోయాను.

"అవశిష్టాలు తీర్చుకొని చప్పున రండి కాఫీకి" అంది.

"ఊం" అన్నాను.

* * *

కాఫీ తాగుతున్నాము. నా భార్య నాకేసి తిరిగి, "పాపం, ఆశాభంగం కలిగింది కాబోలు, సారీ!" అన్నది.

"ఎందుకు మమ్మల్ని మోసంచేశారు?"

"మిమ్మల్ని ఒకరినే రమ్మంటే అందరినీ ఎందుకు తీసుకువెళ్లేరు?"

"నేను తీసుకు వెళ్ల లేదు. వాళ్లంతట వాళ్లే వచ్చారు."

"ఈ మొగాళ్లతో చెప్పితే కార్యాలు యిలాగే జరుగుతాయని మాయ చేశాము."

"ఎందుకంట యీమాయ. మమ్మల్ని రావద్దంటే మానమా?"

"మానరూ, పాపం? రాత్రల్లా దీపస్తంభాన్ని ఆశ్రయించారూ? బీచికి వచ్చిన దాసీవాళ్ల మొహాలు పరకాయించి చూశారూ? ఆశాభంగం కలిగిందేం, పాపం?"

"అప్పుడే ఎలాగ తెలిసింది నీకూ?"

"కార్లు వచ్చాయికావూ."

"ఈమోసం చాలామీన్‌గాఉంది."

"ఇందుకు మీరే కారణం."

"నేనా?"

"ఆఆహ్వానపత్రిక మీచేతులో పడకపోతే ఏమీఉండకపోను."

"ఎందువల్ల?"

"నేను వెళ్లి చెప్పాను — యిటువంటిప్రమాదం కలిగిందని- ఎలాగో భర్తలు- భార్యలవద్ద'నుంచి యీవిషయం గ్రహిస్తారని ఊహించి మిమ్మ

ల్ని మాయచేసి వేరేయింకోచోట ఉత్సవం జరుపుకోడానికి నిశ్చయించుకొన్నాము. జరుపుకొన్నాము.”

“జరుపుకొన్నారా?”

“ఆఁ.”

“ఎప్పుడు ?”

“ఆదివారంఉదయంమొదల సాయంత్రందాకా.”

“ఎక్కడ ?”

“పేరాపురంపాడుకోటలో. ఊరికిదూరంగాఉంది. చుట్టూగోడలున్నాయి. లోపలఅన్నీ చెట్లు.ఎంతోరహస్యంగా వైభవంగా జరిగింది.”

“ఎంతమోసం. మగాళ్లు ఎవళ్లయినా వచ్చారా ?”

“వస్తే పిస్తోలుతో కాల్చిఉందుము!!”

“పిస్తోలుతో కాల్చడానికేనా నన్ను రమ్మంట.”

“మిమ్మల్ని వెళ్లమంట బీచికి-పేరాపురంకోటకు కాదు.”

“అయిం దేమిటో అయింది - ఏమిటి విశేషాలు?”

“వైభవంగాజరిగిందన్నానుకాదూ.”

“మెంబర్లేనా, యింకా యెవరైనా వచ్చారా?”

“నేను నాస్నేహితురాలిని ఒక తెను తీసుకు వెళ్లాను.”

“ఏవరూ?”

“ఎవరైతేనేమి? నేను వాళ్లింటికి వెళ్లి, రహస్యంగా అంతా చెప్పి - వస్తావుటమ్మా అన్నాను. అంతే ఆవిడ బుగ్గలమీద వేళ్లువేసుకొని - ఇదేమిటమ్మా ! వీళ్ల కేమిచేటుకాలంవచ్చిందమ్మా ? వీళ్ల మొహం ఈడ్చా! యిలాంటిబుద్ధులు పుట్టుకొస్తున్నాయేమమ్మా యీకాలపు ఆడవాళ్లకు? సిగ్గు బిడియాలు ఉండనక్కర్లేదుటమ్మా?—అంటూ అడ్డమైనతిట్లూ తిట్టి చివరికి తయారైంది.”

“తిట్టికూడా ఎందుకు వచ్చిందీ? ” అన్నాను.

“తానూ వచ్చి వాళ్ల మొహాలు అక్కడే తగలేస్తానంది. వాళ్లకు బుద్ధిచెబతానంది.”

“చివరికి ఏంచేసింది?”

“మాఅందరికన్నఎక్కువగా ఆవిడే తిరిగింది. ఆరోజు వంటచేసిపెడత ఆవిడే— ఇదిటర్రా నగ్నదినం అంటే, ఏమిటో అనుకున్నాను. ఇందులో కొత్తేముందర్రా. రోజూ తలుపులేసుకొని చిన్నబట్ట కట్టుకొనో కట్టుకోకుండనో పనులు చేసుకోవడం లేదుటర్రా. దీని కింత గొడవ చేశారెందుకర్రా—అంది.”

“నువ్వేంచేశావు?”

“బాడ్ మింటన్ వాలీబాల్, పరుగుల పందెం—వగైరా ఆటలు ఆడుకొన్నాం కొంతమంది.”

“మిగిలినవాళ్లు?”

“పొట్టలు పెంచుకొన్నవాళ్లూ, దొడ్డికాళ్ల వాళ్లూ, శుష్కవక్షులూ—తమనగ్నత్వాన్ని బహిరంగపరుచుకొనిసిగ్గుపడుతూ వన్యమృగాల్లాగ ఆచెట్టుకిందా ఆచెట్టుకిందా నక్కికూర్చుండిపోయారు —తమకుపూపానికి తామే వగస్తూన్నట్టు.”

“నీవు సిగ్గుపడలేదుకాబోలు—వన్యమృగంలా నక్కలేదు కాబోలు—ఏం?”

“నాకు ఏమిలోటుందని సిగ్గుపడడానికి —మీరు తప్ప.”

“మై డియర్ నాటీ ఓల్డు గరల్!”

“మీరు ఎప్పుడైనా నగ్నదినమహోత్సవానికి వస్తే — నక్కుతా రనుకుంటా.”

“పెంకే — అయితే దీని కేమైనా ప్రైజుందా?” అన్నాను.

“ఆ, ఉంది, బహుమానం - నేను మీ కిచ్చేది” అంది.

“ఏమి టది?” అన్నాను.

“ఇది” అని నామీసాలులాగి చెంప వాయించి ముద్దెట్టుకొంది.

“మిస్-చివస్ దిగంబరీ” అన్నాను.